


కథ

చివుకుల కృష్ణకుమారి శాస్త్రి

# కంటే కూతుర్నే కనాలి

''అమ్మాయి బాలింతరాలిని పచ్చి ఒళ్లు అలవకూడదంటారు. ఎన్నాళ్లట్లా ఏడుస్తావు చెప్పు. పక్కన పండంటి పసిదాన్ని పెట్టుకుని. చూసేవాళ్లకి అఘాయిత్యంగా ఉంటుంది. చూడు కళ్లెలా వాచిపోయాయో. నా మాట విని ఇకనయినా, ఆ ఏడుపు మాని చంటిదాన్ని ఒళ్లోకి తీసుకో,, అంది శేషమ్మ.

తల్లి మాటలకు ఏడుపు ఆపక పోగా మరింత పెరిగింది వైదేహికి.

''అయినా ఈ రోజుల్లో ఆడయినా, మగయినా ఇద్దరూ సమానమే. మనం కోరుకున్న వాళ్లు పుడతారా ఏమిటీ. రాసిపెట్టినవాళ్లు పుట్టక తప్పదు'' అంది మళ్లా ఆవిడ.

''ఆ, నీకు నల్గురి మగపిల్లల తర్వాత, నేనొక్కదాన్ని పుట్టాను కాబట్టి నువ్వీ కబుర్లు చెపుతున్నావు. నీకు, నాలాగా అందరూ ఆడపిల్లలంటే నా బాధ ఏమిటో తెల్సుండేది'' కస్సుమంది తల్లి మీద వైదేహి ఏడుస్తూనే.

''నీ మాటలు మరీ విచిత్రం కాకపోతే నీకు మాత్రం ఎందరున్నారే. తొలి చూలు ఆడపిల్ల, మళ్లా రెండోసారి అమ్మాయే పుట్టింది. పోనీ, ఇంకో అవకాశం ఉందా అనుకుంటే నీ ఆరోగ్య రీత్యా మంచిది కాదని ఏకంగా గర్భసంచినే తొలగించిందా డాక్టరమ్మ.''

''చూడు వైదేహి! అనవసరంగా బాధపడకు. అసలే ఆపరేషను అయిన మనిషివి. నేను కానీ, నా వాళ్లెవరు కానీ మళ్లా నీకు ఆడపిల్ల పుట్టిందని నిన్ను పల్లెత్తుమాటనం సరేనా. ఊ, కళ్లు తుడుచుకో. చూడు పచ్చగా, పండులా పాప ఎంత ముద్దుగా ఉందో. నువ్విలా ఏడవటం చూసి పెద్దపిల్ల నీ దగ్గరకు రావటానికి ఎలా భయపడుతోందో తెల్సునా'' అన్నాడు రామారావు అనునయంగా భార్యతో.

ఎవరెన్ని చెప్పినా వైదేహి మనసులోని బాధ మాత్రం పోవటం లేదు. రెండోసారి అబ్బాయి పుడతాడనుకున్న తన ఆశ అడియాశయింది. కలలన్నీ కల్లలయినాయి. మరో అవకాశం కూడా లేకుండా పోయింది. తనకు ఆడపిల్ల పుట్టిందన్న బాధకూ, తన స్నేహితురాలు పక్కింటి అరుంధతికి రెండోసారి కూడా అబ్బాయి పుట్టాడన్న వార్త ఆమెను రెట్టింపు బాధకు గురిచేస్తోంది.

మరో అవకాశం లేదు కదా అని వాడుకగా బారసాల చేద్దామన్నా అందరి మాటను ససేమిరా అని మొండికేసిన వైదేహి, ఇంతోటి ఆడపిల్లకి వేడుకలేం అక్కర్లేదు ఏదో ఓ పేరు పెట్టమంది భర్తను.

పిల్లకు మూడవ నెల వచ్చేవరకు ఉన్న శేషమ్మ బయలుదేరే ముందు కూతురికి పిల్లల విషయంలో జాగ్రత్తలు చెప్పి వెళ్లింది.

కంటి ముందున్న ఇద్దరు ఆడపిల్లల్ని చూస్తుంటే ఏదో తెలియని కోపం, అసహ్యం మొదలైనాయి వైదేహికి. ఆమె ప్రాణానికి వాళ్లిద్దరు రాహు కేతువుల్లా అన్పించారు.

మగపిల్లలు తప్పి తలకెత్తుతారు, ఆడపిల్లలు ఉన్నది తప్పుకుపోతారని తప్పుడు ఆలోచన, వాళ్ల పట్ల మరింత ద్వేషాన్ని నింపింది ఆమె మనసులో.

అయినదానికి, కానిదానికి విసుక్కోవడం, ఆకలేసి ఏడుస్తే ఓ దెబ్బవేయటం చంటిపిల్లతో పాటు ఎడపిల్ల కూడా తల్లి ఛీత్కారాల నెదుర్కోసాగింది.

పెంపకం, చదువు సంధ్యలు, పెళ్లిళ్లు-పురుళ్లు తర్వాత వచ్చే వరస ఖర్చులు తల్చుకుంటే ఆమె బుర్ర తిరిగిపోతోంది.

అరుంధతి పుట్టింటి నుంచి పిల్లవాడినెత్తుకు వచ్చింది. ముత్యం-పగడంలా ఇద్దరూ మగపిల్లలే. అదృష్టవంతురాలు అరుంధతి అనుకుంది మనసులో వైదేహి.

''ఈసారయినా అమ్మాయి పుడుతుందనుకుంటే మళ్లా కొడుకే పుట్టాడు. ఎవరో చెపితే లలిత చదివాను. అయినా లాభం లేకపోయింది'' అంది కనపడని గర్వంతో అరుంధతి.

''అంత కావాలనుకుంటే దీన్ని తీసుకుని నీ కొడుకుని నాకివ్వు'' అంది వైదేహి పసివాడ్ని ఎత్తుకు ముద్దాడుతూ.

''మాటవరసకన్నాను కానీ, చెట్టుకు ఏ కాయయినా ఒక్కటే వైదేహి, చూడరా బుజ్జీ! చెల్లాయి ఎంత ముద్దుగా ఉందో'' అంది వైదేహి కూతుర్ని ముద్దాడుతూ.

అవును! మొన్నటివరకు వదినా అని పిలిచే అరుంధతి ఏమిటిలా పేరు పెట్టి పిలుస్తోంది. పైగా తన కొడుక్కి చెల్లాయని చెపుతోంది.

అమ్మ అరుంధతి! నీకింత దురాలోచన. పెరిగి పెద్దయ్యాక ఎక్కడ పిల్లనిస్తానంటానేమోనని ముందు జాగ్రత్తన్న మాట ఇది అనుకుంది వైదేహి.

★ ★ ★

''చూడండి! వీళ్లకి డొనేషన్ కట్టి గొప్ప స్కూళ్లల్లో ఏం వేయనక్కర్లేదు. గవర్నమెంటు స్కూళ్లలో పడేయండి. ముందు ముందు చాలా ఖర్చుంది ఈ అమ్మలతో'' అంది వైదేహి భర్తతో.

ఆమె మాటను ఏమాత్రం పట్టించుకోని రామారావు వాళ్లిద్దర్నీ మంచి పేరున్న కాన్వెంటులో జాయిన్ చేశాడు.

విషయం తెలిసి రాద్ధాంతం చేసి నాల్గురోజులు అన్నం మాని అలకపూనింది వైదేహి.

భార్యతో పని లేకుండా చాలావరకు పిల్లల

అవసరాలు తానే గమనించి తీర్చేవాడు రామారావు.

ఊహ తెలిసినప్పటి నుంచి ''అమ్మో అమ్మ'' అన్నట్లుగా భయంతోనే పెరిగారా పిల్లలిద్దరూ.

పుట్టినరోజులు, వేడుకలు అంటే ఏమిటో తెలియకుండానే పెద్దయ్యారిద్దరూ.

ఎంత అన్నయ్యా అని పిలుస్తున్నా, వయసొచ్చిన ఆడపిల్లలుండటం మంచిది కాదనుకున్న అరుంధతి భర్తతో చెప్పి పిల్లలు కాలేజీకి దగ్గరగా ఉండాలన్న నెపంతో, ఇల్లు ఖాళీ చేసి వైదేహి కుటుంబానికి దూరంగా వెళ్లిపోయింది.

చిన్నప్పటి నుంచి పునాది గట్టిగా ఉండటం వల్ల చదువులో ఎప్పుడూ ముందంజలో ఉన్న రామారావు పిల్లలిద్దరూ మెరిట్ విద్యార్థులుగా స్కాలర్‌షిప్‌తోనే చదువులు పూర్తిచేసి మంచి ఉద్యోగాలు సంపాదించారు.

బజార్లో కనిపించిన అరుంధతి తన కొడుకులిద్దరూ అమెరికాలో పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారని, త్వరలో తను, భర్త కూడా వాళ్ల దగ్గరకు వెళ్లిపోతామని గర్వంగా చెప్పింది.

అంతేకాదు మొదటి నెల జీతంగా కొడుకులిద్దరూ పంపిన లక్ష రూపాయలతో బంగారం ఏం కొందామా అన్న ఆలోచనతో ఇలా బజారుకొచ్చానని కూడా అంది.


ఆ మాటకి పుండు మీద కారం రాసినట్లయింది వైదేహికి.

అదృష్టానికి పెట్టిపుట్టాలని గాఢంగా నిట్టూర్చింది.

మొదటినెల జీతం అందుకున్న పెద్దకూతురు తెచ్చిన పట్టుచీరని అరుంధతి కొడుకులిచ్చిన లక్ష రూపాయలతో పోల్చుకుంటే వెలవెల పోయిందామె మనసుకు.

రామారావు మాత్రం గర్వంగా కూతురి తొలి సంపాదనతో కొనిచ్చిన బట్టలేసుకుని ఆఫీసులో అందరికీ చెప్పి మరీ మురిసిపోయాడు.

''అదృష్టవంతుడివి రామారావు, ఆడపిల్లలని కృంగిపోక చక్కని చదువులు చెప్పించావు. మంచి వృద్ధిలో ఉన్నారు.



కావాలని పిల్లల్ని ఎవరో ఒకరు చేసుకోపోతే చూడు'' అని ఆఫీసు స్టాఫ్ అందరూ పొగుడుతూంటే పొంగిపోయాడతను.

వాళ్ల మాటల్ని తథాస్తు దేవతలు దీవించినట్లుగా రామారావు ఇద్దరు ఆడపిల్లలకి ఉన్న ఊళ్లో కానీ కట్నం లేకుండా మంచి సంబంధాలు కుదిరి ఒకే ముహూర్తానికి పెళ్లిళ్లు జరిగాయి.

అల్లుళ్లు కట్నం వద్దన్నా తన వంతు కానుకగా కూతుళ్ల పేరిట డిపాజిట్ చేసిన మొత్తాన్ని వాళ్లకి అందించాడు రామారావు.

ఆ మాటను, భార్యకి చెప్పాలనిపించలేదు. చెప్పలేదు కూడా. చూశావుగా! ఆడపిల్లంటే అప్పు అన్నావుగా. అంతా మన జమకొదిలివేసి చదువుకి, పెళ్లిళ్లకు మన చేత ఖర్చు పెట్టించకుండా ఇద్దరు ఓ ఇంటివాళ్లయ్యారు.

ఇకనయినా మనసు మార్చుకుని పిల్లల్ని ప్రేమించడం నేర్చుకో'' అన్నాడు రామారావు భార్యతో.

అంటానికి మాటలు దొరకని వైదేహి మౌనంగా ఉండిపోయింది.

★ ★ ★

అరుంధతి భర్త పోయాడన్న వార్త విని వెళ్లిన వైదేహికి అక్కడి పరిస్థితి అంతా భిన్నంగా కనిపించింది.

అరుంధతి కొడుకులిద్దరూ రాలేదు.

సడన్‌గా వార్త తెలియడంతో ఫ్లైటు టిక్కెట్లు దొరకనందున వాళ్లు రాలేకపోయారని ఏడుస్తూనే అందరికీ చెపుతోంది ఆమె.

ఆ కార్యక్రమాన్ని ఆమె మరిదే చేశాడు.

పోనీ, కొడుకులు వచ్చేవరకు బాడీ ఉంచచ్చుగా అన్న ప్రశ్నకు వైదేహికి సమాధానం దొరకలేదు సరికదా మరికొన్ని కొత్త విషయాలు తెలిశాయి.

మగపిల్లలను మితిమీరిన గారాబం చేసి, అప్పులు చేసి తాహతుకి మించి చదివించారు. అమెరికాలో ఉన్న వాళ్లకి అమ్మా నాన్నలు ఎందుకు

గుర్తుంటారు. పోయాక వచ్చి చేసేదేముంది. ఎవర్నో ఒకర్ని ఆ తంతు కానియ్యమన్నారుట. వీళ్లకి తెలియకుండా పెళ్లిళ్లు కూడా చేసుకున్నారుట. తనకే కొడుకులున్నట్లుగా ఏం విర్రవీగిపోయింది. ఆ గర్వం కాస్తా ఈ దెబ్బతో వదిలిపోయిందని చుట్టాలనుకుంటున్న మాటలు చెవిన బడిన వైదేహి చేష్టలుడిగినదానిలా ఉండిపోయింది.

తండ్రి పోయినా రావటానికి ఆ కొడుకులు ఇష్టపడలేదన్న నిజాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతోంది.

ముందు ముందు అరుంధతి జీవితం గురించి తల్చుకుంటే గుండె బరువెక్కిందామెకు.

ఒకవేళ నిజంగానే టిక్కెట్టు దొరక్క రాలేదేమో అన్న ఆలోచన కూడా వైదేహిని ఆవరించింది.

నెలరోజుల నాటి సంఘటన ఒక్కసారామె మనసులోకి వచ్చింది. ఉన్నట్లుండి కళ్లు తిరిగి పడిపోయిన వైదేహిని వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్లాడు రామారావు.

విషయం తెలుసుకున్న కూతుళ్లిద్దరూ ఆందోళనగా వచ్చారు. బి.పి. పెరగటం వల్ల కళ్లు తిరిగాయని, హార్ట్ ఎన్‌లార్జ్‌మెంటయ్యే సూచనలున్నాయని రెస్టు అవసరం అని చెప్పి మందులు రాసిచ్చాడు డాక్టరు.

మీరు ఒంటరిగా ఉండటానికి వీల్లేదంటూ తమలో ఎవరో ఒకరింటికి వచ్చి ఉండమని గొడవ చేశారు కూతుళ్లిద్దరూ.

రామారావు చెప్పిన మీదట ఊరుకున్నా ప్రతీరోజూ ఇంటి దగ్గర్నుంచి రెండుపూటలా ఫోన్లు. అమ్మా ఎలా ఉన్నావు? లేచావా? భోజనం చేశావా మందులేసుకున్నావా అని. ఆదివారం శలవు వచ్చిందంటే చాలు. కూతుళ్లు-అల్లుళ్లు రావాల్సిందే. ఒక్కొక్కరోజు అల్లుళ్లే స్వయంగా క్యారియర్ తెచ్చిన రోజులున్నాయి. పండగ వచ్చిందంటే తనకు, ఆయనకి తప్పనిసరిగా బట్టలిస్తారు.

వాళ్లు చూపిస్తున్న ప్రేమాభిమానాల్లో తను ఒక్క వంతయినా వాళ్ల మీద చూపించిందా? పశ్చాత్తాపం అనేది తెలియకుండానే వైదేహిలో మొదలయింది.

అరుంధతి కొడుకులకి, వీళ్లకి ఎంత తేడా. ఆనందమూ, దుఃఖంలో తెలియని బాధ మొదలయిందామె మనసులో.

ఏమని చెప్పగలదు? ఎలా చెప్పగలదు?

★ ★ ★

తెలిసినవాళ్లింట్లో పెళ్లికని భర్తతో కూడా వెళ్లింది వైదేహి.

అక్కడందరికీ కేటరింగ్ గ్రూపులో కాఫీలందిస్తున్న మనిషి మీద పడిందామె దృష్టి. పరీక్షగా చూసేలోపుగానే కనుమరుగయింది. మళ్లీ బయటకు రాలేదు. అనుమాన నివృత్తి కోసం లోపలికెళ్లి చూసింది వైదేహి. దూరంగా కూర్చుని కూరలు తరుగుతున్న ఆ మనిషి పక్కన కూర్చుంటూ.

''అరుంధతీ నువ్వు, నువ్వేనా, నువ్విక్కడిలా'' అందామె చేయి పట్టుకుంటూ విస్మయంగా.

వైదేహి తనను వెతుక్కుంటూ ఏకంగా లోపలికి వస్తుందని ఊహించని అరుంధతికి ఒక్కసారిగా ఆ పాత స్నేహపు పలకరింపుకి గుండె చెరువయ్యింది.

చిక్కిపోయిన శరీరం, వెలిసిపోయిన చీరతో జుట్టంతా పండిపోయి ఎలా ఉంది అరుంధతి.

ఇద్దరు కొడుకుల తల్లిగా, కాలు మీద కాలేసుకుని దర్జాగా ఏ భవంతిలోనే ఉండవల్సిన మనిషికి ఇంత దీనావస్థ?

ఊర్కోమన్నట్లుగా ఓదార్పుగా భుజం తట్టి ఏమయింది? అంది. భర్త పోయాక తన పరిస్థితి మరింత దిగజారిందని తనను కూడా అమెరికా తీసుకెడతారనుకున్న కొడుకులు నీ ఆరోగ్య రీత్యా ఈ వాతావరణం పడదని డబ్బు పంపిస్తామని కల్ల కబుర్లు చెప్పారు. ఒకటి రెండుసార్లు వచ్చిన డబ్బు ఆగిపోయిందని, ఒక్కసారి వచ్చి వెళ్లమని ఎన్నిసార్లు ఫోన్లు చేసినా బదులు పలకపోగా చివరికి ఎవరి కోసం ఇండియా రావాలని అన్నారుట.

''అనారోగ్యంతో నువ్వీ పన్లు ఎలా చేస్తున్నావు?'' అంది వైదేహి.

''నాకే అనారోగ్యం లేదు వైదేహి. నేను రాయిలా ఉన్నాను. వాళ్ల మనసుకు పట్టిన జాడ్యం అలా చెప్పించింది. పూట గడవటం కష్టంగా తయారైంది.



## పాపం ఛార్మి!

**పంజాబీ అయినప్పటికీ అచ్చతెలుగు అమ్మాయిలానే కనిపిస్తూ రాణిస్తూ వచ్చిన ఛార్మికి ఇప్పుడు టాలీవుడ్‌లో సినిమాలు లేకపోవడం విచారించదగ్గ విషయమే. సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవడంతోపాటు వేరే వాళ్లు ఒకరిద్దరికి కూడా వాయిస్‌నిచ్చిన ఛార్మి హైదరాబాదులోనే సెటిలయ్యే వుద్దేశంతో సొంతిల్లు కూడా సమకూర్చుకుంది. కానీ కాలం కలిసి రాకపోతే ఎలా వుంటుందో అలా తయారైందిప్పుడు పరిస్థితి. ఆమె నటించిన మాయగాడు, సై ఆట సినిమాలు అలాగే మూలనపడి వున్నాయి. మలయాళానికి వెళ్లిన ఛార్మికి అక్కడేం కలిసొస్తుందో చూడాలి మరి!**

చదువు, సంధ్యా లేని నాకు తెలిసింది ఈ విద్య ఒక్కటేగా. అందుకే ఇందులో చేరాను. నాకు ఇద్దరూ కొడుకులేనని నీ దగ్గర కూడా గర్వాన్ని ప్రకటించాను. నా అనుభవంతో మనసులోని నిజాన్ని చెపుతున్నా విను వైదేహి. ఎప్పుడూ అమ్మా నాన్నలంటే ప్రేమా, అభిమానం ఆడపిల్లలకుంటుంది తప్ప మగపిల్లలకుండదు. ఆడపిల్లలు ఏడపిల్లలయినా అమ్మా, నాన్నల గురించి ఆలోచిస్తారు. వాళ్లని కళ్లల్లో పెట్టుకుని చూసుకుంటారు. అసలు కొడుకులంటే ఎవరో తెలుసునా, యేరు దాటాక తెప్ప తగలేసేవారు. అవసరం తీరాక అమ్మా-నాన్నని అవతలకి నెట్టేసేవాళ్లు. ఈ జన్మకి నువ్వు అదృష్టవంతురాలివి సుమా. ముత్యం-పగడంలా ఇద్దరూ ఆడపిల్లలే.''

వైదేహి చెవులకు మరింకేం వినపడటం లేదు. మనసంతా వికలమయిపోయింది. శరీరంలోంచి ఏదో తెలియని కంపన. తడబడుతున్న అడుగులతో భర్త దగ్గరకెళ్లి ''పదండి ఇంటికెడదాం'' అంది.

''ముహూర్తానికింకా చాలా టైముందిగా'' అన్నాడు రామారావు.

నీర్సంగా రామారావు భుజాన తల ఆన్చి వెడదామన్నట్లుగా చేయి చూపించింది.

''వైదేహి ఏమయింది? డాక్టరు దగ్గరకు వెడదామా?'' అన్నాడు.

''వద్దు! ఇంటికే వెడదాం'' అంది.

కార్లో రామారావు ఒళ్లో తల వాల్చి జరిగిందంతా చెప్పింది.

మనసు మనసులా లేదు. తనకి అరుంధతిలా కొడుకుండుంటే తను కూడా ఆ పక్కనే ఏదో పని చేస్తూ ఉండేదా? బిడ్డల్ని గారాబం చెయ్యటమే తల్లితండ్రుల పతనానికి దారన్న మాట. తనకు, అరుంధతికి ఎంత తేడా? పట్టుచీర, ఒంటినిండా నగలతో హోదాగా ఉన్న తానెక్కడ, అరుంధతెక్కడ? ఇద్దరం బిడ్డల్ని కన్న తల్లులమయినా ఎంత తేడా! ఆ తేడా ఆడా-మగ వల్లనేగా. ముత్యం-పగడం లాంటి తన పిల్లల్ని రాహు-కేతువులుగా పోల్చుకున్నందుకు మనసు సిగ్గుతో కుంచించుకుపోతోంది వైదేహి.

కార్లోంచి మెల్లగా భార్యను దింపి బెడ్ మీద పడుకోపెట్టిన రామారావు ఓ గ్లాసు మంచినీళ్లిచ్చి ''తాగి ప్రశాంతంగా పడుకో'' అన్నాడు.

''పిల్లలిద్దరికీ ఫోను'' అంది నీరసంగా.

''ఆ పనెప్పుడో చేశానులే'' అని అతడంటుండగానే హడావిడిగా వచ్చిన ఆడపిల్లలిద్దరూ ''అమ్మా ఏమయిందమ్మా'' అంటూ కన్నీళ్లలో తల్లికి చెరొక వైపునా కూర్చున్నారు బెడ్ మీద.

గుండెల్లోంచి తన్నుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక కన్నీటితో పెద్దమ్మలు-చిన్నమ్మలు అంటూ ఇద్దరు కూతుళ్లని ప్రేమతో గుండెలకు హత్తుకుంటూ ''ఈ అమ్మని క్షమిస్తారు కదూ. మీరు క్షమిస్తేనే మీ అమ్మ పాపానికి పరిహారం. ఇదిగో పెద్దమ్మలు, నువ్విచ్చిన ఈ పట్టుచీర కట్టుకున్నాను బాగుందా. నాన్నా చిన్నమ్మలు, నువ్వు ఇచ్చిన చీర కూడా కట్టుకుంటానుగా. మీ అమ్మ ఎప్పుడు పచ్చగా ఉండాలని ఒకళ్లు ఆకుపచ్చ, ఇంకొకరు పసుపు పచ్చ చీరలు కొన్నారు కదూ'' అంటూ ఇద్దరి కూతుళ్ల బుగ్గల మీద ముద్దులు కురిపిస్తూ పిచ్చిదానిలా ఏడుస్తున్న తల్లి మాటలు అర్థంకాని వాళ్లిద్దరు ''నాన్నా! అమ్మని వెంటనే హాస్పిటల్‌కి తీసుకెడదాం. ఏదోలా మాట్లాడుతోంది. మాకు భయంగా ఉంది'' అన్నారిద్దరూ.

''కంగారు పడకండమ్మా! పాతికేళ్ల నాడు మీరు పుట్టినప్పుడు మీ అమ్మకొచ్చిన మానసిక జాడ్యం అనే వ్యాధికి ఓ గంట క్రితం జ్ఞానోదయం అనే మందుబిళ్ల పడటంతో వ్యాధి వెనకేస్తోంది. దాని లక్షణాలే ఇవి'' అన్నాడు నవ్వుతూ రామారావు.

తండ్రి మాటలు అసలు అర్థం కాలేదు వాళ్లకి. ఏది ఏమైనా తల్లి ప్రేమలోని మధురిమను తొలిసారిగా ఆస్వాదిస్తూ అలాగే అమ్మ గుండెల మీదుండిపోయారు ముత్యం-పగడం లాంటి అమ్మాయిలిద్దరూ.

○



## బిగ్ బితో లారా!

లారాదత్తాకి తాజాగా మంచి చాన్స్ వచ్చింది. బిగ్ బి అమితాబ్ బచ్చన్ నటించే ఓ చిత్రంలో అతనికి జంటగా నటించడానికి ఎంపికైందిట. 'ది యాక్టర్' అనే టైటిల్‌తో రూపొందే ఈ సినిమా ఓ సినిమా హీరో జీవితం ఇతివృత్తంగా సాగుతుందిట. పైగా ఇందులో అమితాబ్ జీవితంలోని సంఘటనలు కూడా కొన్ని వుంటాయని అంటున్నారు. అంతగా అవకాశాలు లేని లారాకి అమితాబ్‌తో నటించే చాన్స్ అంటే నలుగురి దృష్టిలోకీ రావడం లాంటిదే కాబట్టి- లారా కూడా బోల్డు ఆశలు పెంచుకుంటోందిట.